క్లుప్తంగా

వర్షం కోసం హోమం



వరుణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : పట్టణ శివారులోని కాచింతల క్షేత్రంలో గురువారం వర్షాలు పడాలని కోరుతూ వరుణ యాగం చేపట్టారు. ఆళ్లగడ్డ ఎరువులు, క్రిమి సంహారిక మందులు, విత్తనాల డీలర్ల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



హరివరం ఉన్నత పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంపీడీఓ రఘురాం ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని హరివరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల సంఖ్య, హాజరు నమోదు, భోజనంలో వడ్డించాల్సిన మెనూను పరిశీలించారు. వంటకాల రుచి చూశారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ విద్యార్థులకు సూచించారు.

కుష్టు లక్షణాలపై అవగాహన



వ్యాధి లక్షణాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, అపర్ణలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఆసుపత్రికి వచ్చిన రోగులకు వ్యాధి లక్షణాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య

శిరివెళ్ల: బోయలకుంట్లకు చెందిన కౌలు రైతు భవనాశి ఆంజనేయులు (36) ఆత్మహత్యకు పాల్పాడ్డాడని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. అప్పుల బాధ తాళలేక గురువారం సౌభాగ్యవతి పౌడర్‌ను తాగాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ కోలుకోలేక మృతి చెందాడన్నారు. భార్య సుధాలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు.

20న ఏఐకేఎంఎస్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 20వ తేదీన రాజమండ్రిలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ నంద్యాల జిల్లా కన్వీనర్ హుసేన్‌వలి కోరారు. పట్టణంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, షాహీర్, రంగన్న, ఈరన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పర్యవేక్షకులకు ప్రస్తుతం వారు విధులు నిర్వహిస్తున్న విధులతో పాటు అదనంగా మరో విధులు కేటాయించారు. ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లకు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు, ఆరుగురు రికార్డు అసిస్టెంట్లకు, పలువురు అటెండర్లకు, కాంట్రాక్ట్ లేబర్లకు అంతర్గత బదిలీలు నిర్వహించారు. మరో 20 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థాన పరిపాలన సౌలభ్యం కోసమే అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ తెలిపారు. కేటాయించిన విధుల్లో ఉద్యోగులు వెంటనే చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా లాల్‌స్వామి ఊరేగింపు



శ్రీరంగాపురంలో నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు



లాల్‌స్వామి పీరును ఊరేగిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మొహర్రం పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని పీర్ల చావిడిలో కొలువుదీరిన శ్రీలాల్‌స్వామి చిన్న సరిగెత్తు బుధవారం అర్ధరాత్రి, గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం వరకు పెద్దసరిగెత్తును వందలాది భక్త జన సందోహం మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలు నిర్వాహకులు డాబుగాళ్ల మాబుసాహెబ్, పెద్ద మాబుసాహెబ్, ఇమాంసా, అబ్దుల్ రసూల్ చాంద్‌బాషాల ఆధ్వర్యంలో జరిగాయి. స్వామి వారి ఊరేగింపు గ్రామంలోని ప్రధాన పీర్ల చావిడీ నుంచి ప్రారంభమై బెస్తపేట, రెడ్డి వారి వీధి మీదుగా అమ్మవారి శాల నుంచి మళ్లీ పీర్ల చావిడీకి చేరుకుంది. లాల్‌స్వామికి దారి పొడవునా భక్తులు దర్శించుకొని, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కొందరు భక్తులు భక్తులు స్వామిపై గంధం చల్లుతూ తమ మొక్కు తీర్చుకున్నారు. ఎస్‌ఐ రమణయ్య పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన మొహర్రం

రుద్రవరం: మండలంలో గురువారం మొహర్రం వేడుకలు ముగిశాయి. కొన్ని గ్రామాల్లో బుధవారం పీర్ల జలధి గావించగా.. చిన్నకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ, శ్రీరంగాపురం, టీ.లింగందిన్నె, ఆర్.నాగులవరం, ఆలమూరు తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురుస్తున్నప్పటికీ పీర్లను గ్రామోత్సవంగా తీసుకెళ్లి జలధి గావించి మొహర్రం వేడుకలను ముగించారు.

పెద్ద కాశీం పీరుకు ప్రత్యేక అలంకారం

మొహర్రం వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని ఆర్.నాగులవరం గ్రామంలోని పెద్ద కాశీం పీరుకు గ్రామ ఉప సర్పంచ సింహ్మాం కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా రూ.10, రూ.20, రూ.50ల నోట్లతో సూచికం, 5తులాల వెండి గోడుగు చేయించారు. వాటిని గురువారం మేళ తాళాలతో ఊరేగింపుగా చావిడి వద్దకు తీసుకెళ్లి నిర్వహకుడికి అందించారు, పీర్ల చావిడి నిర్వాహకులు దాతలు సమర్పించిన నోట్ల సూచికాన్ని, వెండి గొడుగుతో పీరుకు అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



చాపిరేవులలో పీర్లను నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

చాపిరేవులలో పీర్ల నిమజ్జనం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో గురువారం అలీఅక్బర్, హుసేన్, మౌలాలి స్వామి పీర్ల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా గ్రామస్తులంతా పీర్ల నిమజ్జనంలో పాల్గొన్నారు. పలువురు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మండల గ్రామాల్లో ఐదు రోజుల పాటు నిర్వహించే ఆధార్ అప్‌డేషన్ స్పెషల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సౌభాగ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న పెద్దకొట్టాల, మిట్నాల, భీమవరం, పులిమద్ది, 24న కొత్తపల్లె-1, పుసులూరు, బిల్లలాపురం, రాయమాల్పురం, 25న కొత్తపల్లె-2, చాబోలు, పాండురంగాపురం, రాయమాల్పురం, 26న అయ్యలూరు-1, కానాల-1, చాపిరేవుల, పోలూరు, 27న అయ్యలూరు-2, కానాల-2, చాపిరేవుల, పోలూరు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

దొర్నిపాడు: మండలంలోని సచివాలయాల పరిధిలో ఐదు రోజుల పాటు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న దొర్నిపాడు-1, ఉమాపతినగరం, 24న దొర్నిపాడు-2, ఉమాపతినగరం, 25న కొండాపురం, గుండుపాపల, 26న బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, 27న చాకరాజువేముల, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ అసిస్టెంట్లు సౌజన్య, నాగేశ్వరరావులు ఆధార్‌లో మార్పులు చేర్పులు చేస్తారన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

దొర్నిపాడు: కూటమి ప్రభుత్వం వచ్చాక గురువారం మొట్టమొదటిసారిగా నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన మండల మీట్‌లో వివిధ శాఖల పురోగతిపై సమీక్షించారు. రవాణా, గృహనిర్మాణ, రెవెన్యూ, ఆర్ అండ్‌బీ అధికారులు హాజరు కాలేదు. ఈసందర్భంగా వెలుగు ఏపీఎం బాబు మాట్లాడుతూ పాడిగేదెల కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు రుణాలు ఇస్తారని ఇందులో 35 రాయితీ ఉంటుందని తెలిపారు. గోకులం షెడ్ల నిర్మానానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పశువైద్యాధికారి పుల్లయ్య తెలిపారు. ఎంఈఓ రామచంద్రయ్య మాట్లాడుతూ 12966 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెట్పీటీసీ శకుంతలారెడ్డి, సర్పంచులు శివరామిరెడ్డి, అఖిలేష్‌రెడ్డి, డాక్టర్ నాగేంద్ర, పశువైద్యాధికారి పావని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఏఈ రామ్మోహన్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఎంపీఈఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం .. వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా పడదామని ఎమ్మెల్యే అఖిలప్రియ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో గురువారం చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అన్నకాంటీన్ పునరుద్ధరించడంతో పాటు అదనంగా మరోక్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, తహసీల్దార్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ విజేత నంద్యాల



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న క్రీడాభారతి సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో క్రీడాభారతి, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను గురువారం నిర్వహించారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వినయ్‌సాగర్, అనిల్, నంద్యాల డయాసిస్ సెక్రటరీ విలియమ్స్, రిటైర్డు ప్రిన్సిపాల్ దివాకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. టోర్నీలో ఏడు టీములు పాల్గొనగా.. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో నంద్యాల టీమ్ విన్నర్‌గా, నందికొట్కూరు టీమ్ రన్నర్‌గా నిలిచి ట్రోఫీని అందుకున్నాయి. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్రీడా భారతి అధ్యక్షుడు శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్, ఉపాధ్యక్షులు మహేశ్వరి, నిమ్మకాయల సుధాకర్, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు నిలుపుకోండి



ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

బొమ్మలసత్రం: హెల్మెట్ ధరించడం వల్ల ద్విచక్ర వాహనాలు నడిపేసమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రాణాలు నిలుపుకోవచ్చని అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఏఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా బైక్ ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అధికశాతం ఉన్నాయన్నారు. యువతకు బైకులు ఇచ్చి బయటికి పంపే తల్లిదండ్రులు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, సీఐలు ఇస్మాయిల్, రాజారెడ్డి, చలపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రుద్రవరం: స్థానిక ప్రతాపరుద్ర ఆంజనేయ స్వామి అలయం వద్ద గురువారం గ్రామ పెద్దలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గోపుర శిఖరం, అలయం ఎదురుగా రాతి ధ్వజ స్థంభం ప్రతిష్ట తదితర అభివృద్ధి పనులకు వేద పండితులు గోపీశర్మ, శివ గ్రామ పెద్దలు రంగనాయకులు, కొల్లం పుల్లయ్య, ఏర్వక్రిష్ణ మూర్తి, శ్రీను, ఓబులయ్య తదితరు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభింపజేశారు. దాదాపు రూ.3లక్షలతో పనులు చేపట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

మహిళలను గౌరవించాలి

గోస్పాడు: బాలికలు, మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని దీబగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలచంద్రుడు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని దీబగుంట్ల జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాలికలపై అఘాయిత్యాలను జరగకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో నిరుద్యోగులకు మోసం

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగ భృతికి రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు శాపంగా మారాయని, ఇది నిరుద్యోగులను మోసం చేయడమేనని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుద్యోగులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. యువనేస్తం, నిరుద్యోగ భృతికి 35ఏళ్లే నిర్ణయించడం సరికాదన్నారు. సమావేశంలో సురేష్, రవి, విష్ణు, మధు, రాజేష్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం, హత్య కాండను నిరసిస్తూ ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట, పొన్నాపురం ప్రాంతాల్లో సమితి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న మాట్లాడుతూ సంఘటన జరిగి పదిరోజులు అవుతున్నా బాలిక ఆచూకీ కనుగొనడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వం తరపున ఏ ఒక్క రాష్ట్ర మంత్రి రాకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సుబ్బు, నాయుడు, నరసింహ, దివాకర్, మాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి
- 172 కిలోమీటర్ల ప్యాచ్ వర్క్‌లకు ప్రతిపాదనలు



నాగేష్‌కు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలోని రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలోని రహదారుల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో రోడ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1512 కిలోమీటర్ల రోడ్లు విస్తరించి ఉందని, ఇందులో భాగంగా 172 కిలోమీటర్లు ప్యాచ్ వర్క్ రోడ్ల పనులకు రూ5.48 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారన్నారు.

రూ.840 కోట్లతో 94 పనులు

జిల్లాలో రూ.840 కోట్లతో 94 పనులు జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 32 పనులు పూర్తి కాగా, 32 పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో 12 పనులు మొదలు కావాల్సి ఉందన్నారు. 18 పనులు ఎస్టిమేట్ స్థాయిలో ఉన్నాయన్నారు. నంద్యాల కలెక్టరేట్ నిర్మాణం, బనగానపల్లె బైపాస్ రోడ్డు, ఇతర ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రోడ్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నాబార్డు కింద రూ.122 కోట్లతో 26 పనులు మంజూరు కాగా ఇందులో 6 పనులు పూర్తికాగా 16 పనులు పురోగతిలో ఉన్నాయని, మరో 4 పనులు ప్రారంభ దశలో ఉన్నాయని చెప్పారు. ప్రధానమంత్రి గ్రామీణ స్వరాజ్ యోజన కింద రూ.23.63 కోట్లతో 15 పనులు మంజూరు కాగా 15 పూర్తయ్యాయని, మరో మూడు పురోగతిలో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్టు కింద రూ.106 కోట్లతో 54 పనులు మంజూరయ్యాయని, ఇందులో 28 పనులు పూర్తి కాగా 20 పనులు పురోగతిలో ఉన్నాయని మరో 6 పనులు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. అలాగే 1057 ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. మంజూరై పెండింగ్‌లో ఉన్న రోడ్డు భవన నిర్మాణాల పనులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జంప్ రోప్ క్రీడాకారునికి ఆర్థిక సాయం

జంప్ రోప్ క్రీడలో నంద్యాల జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన జంప్ రోప్ క్రీడాకారుడు రుషి నాగేష్‌కు రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అందజేశారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో నాగేష్‌కు చెక్కును అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, రుషి నాగేష్ తల్లిదండ్రులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం తరపున అండర్-14 కేటగిరీలో ఎంపికై ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న జంప్ రోప్ క్రీడాకారుడు రుషి నాగేష్ తల్లిదండ్రులు, గురువు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. 2024 జూలై నెలలో జపాన్ దేశం కావసాకి నగరంలో జరిగే అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో రుషి నాగేష్ పాల్గొంటున్న సందర్భంగా నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్ సంయుక్తంగా రూ.50వేలు చెక్కులు జంప్ రోప్ క్రీడాకారుడికి అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రథమనంది ఆర్చి ఎదుట ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షాహీర్, సహాయ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, జిల్లా పరిషత్‌పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, ఉచిత విద్యను అందించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూలు, బ్యాగ్‌లు, పాఠశాలలు తెరిచిన కూడా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, ధను, న్యామతుల్లా, హరి, వంశీకిరణ్, నాయక్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాలు కలిగి ఉండాలి

నంద్యాల(అర్బన్): భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం జారీ చేసే పంట సాగు దారు హక్కు పత్రాలు కలిగి ఉండాలని ఏఓ ప్రసాదరావు తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వం ద్వారా అందే వివిధ పథకాలు కౌలు రైతులు పొందవచ్చని సూచించారు. మండలంలోని అయ్యలూరు గ్రామంలో గురువారం కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కజొన్న పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ముక్తార్‌బాషా, వీఏఏలు అనిల్, షర్మిల, వీఆర్‌ఓ మురళీ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి డీవైఎఫ్ఐ శిక్షణా తరగతులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27, 28, 29, 30 తేదీల్లో నంద్యాలలో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, పట్టణ కార్యదర్శి శివ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని నాలుగు రోజుల పాటు నేషనల్ పీజీ కళాశాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి, సుబ్బు, అశోక్, హుసేన్‌వలి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి: కౌలు రైతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చాగలమర్రి తహసీల్దార్ రమణమ్మ, ఏఓ రంగనేతాజీ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ పంట సాగు పత్రాలు పొందుట గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఏఓ మాట్లాడుతూ 17 గ్రామ సచివాలయాల పరిధిలోని కౌలు రైతులను త్వరితగతిన గుర్తించాలని సిబ్బందికి సూచించారు. భూమిని కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని, దీంతో పంట నష్టం, బీమా అందుతుందన్నారు. అదేవిధంగా మద్దతు ధర లభిస్తుందన్నారు. కౌలు కార్డు కొరకు రైతులు భూ యజమాని 1బి, పోలం పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, దరఖాస్తుపాటు జతచేసి అందజేయాలన్నారు. సమావేశంలో డీటీ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన ఇరు వర్గాలు బుధవారం సాయంత్రం పీర్ల ఊరేగింపుల సందర్భంగా ఘర్షణ జరిగింది. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన దేశం విశ్వనాథరెడ్డి, దేశం పద్మజల ఇంటి ఎదుట ఫీర్ల ఊరేగింపులో భాగంగా డప్పులు వాయిస్తూ కేకలు వేశారు. దీంతో పద్మజ తమ ఇంటి వద్ద అల్లరి చేయొద్దని కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి, రాహులురెడ్డికి సూచించి ఇంటిలోకి వెళ్లింది. ఆగ్రహించిన వారు మరో 10 మందితో కలిసి ఇంట్లోకి వెళ్లి దేశం విశ్వనాథరెడ్డి, దేశం పద్మజ, నారాయణమ్మతోపాటు మరో మహిళపై దాడికి పాల్పడారు. ఈ దాడిలో పద్మజ తలకు రక్త గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పీర్ల ఊరేగింపును అడ్డుకుని తనపై విశ్వనాథరెడ్డి, దేశం మన్మోహన్‌రెడ్డితో పాటు మరో 12 మంది దాడి చేశారని బాధితుడు మహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు ఇంకో వర్గానికి చెందిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు



పిజ్జాసెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): జిల్లా పరిధిలోని ఆహార పదార్థాలు విక్రయించే యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కూర్మానాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లను జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి ఖాశీం వలితో కలిసి తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలు నిల్వ ఉంచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయనాలు వాడకుండా ఆహార పదార్థాలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా వంట నూనె, టేస్టింగ్ సాల్ట్స్ తదితర నిషేధితమైన పదార్థాలు ఆహారంలో కలపరాదని సూచించారు.

జగనన్న కాలనీలో కబ్జా



హద్దు రాళ్లు ఉన్నా సాగుచేస్తున్న వరి పంట

నంద్యాల(సిటీ): కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా పట్టణంలోని పేద ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భూమిలోనూ కబ్జారాయుళ్లు పాగా వేశారు. మొన్న రైతు బజార్‌వద్ద ఉన్న ఖాళీ స్థలం, నేడు జగనన్న లే అవుట్-1లో కొంత భాగంలో వరిపైరు వేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023, మే 23వ తేదీన నంద్యాలలోని పేద ప్రజల కలను నెరవేర్చేందుకు ఏకంగా 3,006 మందికి అప్పటి ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి లాటరీ పద్ధతిన పట్టాలు అందించారు. వీటికి నెంబర్ రాళ్లను సైతం ఏర్పాటు చేశారు. అయితే పొలానికి ఆనుకుని ఉన్న కొంత స్థలాన్ని కొందరు ఆక్రమించి వరి పంట వేశారు. నేటికీ జగనన్న లే అవుట్-1లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్లాట్ల కోసం వేసిన రాళ్లను సైతం ధ్వంసం చేసి పొలంగా మారుస్తుండటం గమనార్హం.

యథావిధిగా ఇళ్ల నిర్మాణాలు

శిరివెళ్ల: గత ప్రభుత్వంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు యథావిధంగా కొనసాగుతాయని హౌసింగ్ ఏఈ నాగశేఖర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వంలో మండలానికి 1,583 ఇళ్ల మంజూరు కాగా 780 ఇళ్ల నిర్మాణాలు పూర్తియయ్యాయన్నారు. మరో 421 ఇళ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాలకు రూ. 15 కోట్ల బిల్లులను లబ్ధిదారులకు చెల్లించామన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లు నిర్మాణాలను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

సౌత్‌జోన్ హాకీ విజేత ఆంధ్ర జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలో సౌత్‌జోన్ స్థాయి జూనియర్ మహిళలు, పురుషుల విభాగం హాకీ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరైనట్లు రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు చాణిక్యరాజు గురువారం తెలిపారు. పోటీల్లో మహిళా విభాగంలో ప్రథమ స్థానం ఆంధ్రప్రదేశ్, ద్వితీయ స్థానం కర్ణాటక, తృతీయ స్థానం తమిళనాడు జట్లు నిలిచాయని చెప్పారు. పురుషుల విభాగంలో ప్రథమ స్థానం కర్ణాటక, ద్వితీయ స్థానం తమిళనాడు, తృతీయ స్థానం ఆంధ్రప్రదేశ్ సాధించినట్లు వెల్లడించారు.